క్లుప్తంగా

ముగిసిన సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు



పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కందుకూరు రూరల్: కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రాష్ట్ర తైక్వాండో వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ ఎస్కే. అబ్దుల్ సలామ్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ తైక్వాండో బాల, బాలికల పోటీలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా స్థాయిలో జరిగిన పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారుల పాల్గొన్నట్లు జిల్లా కార్యదర్శి పి.అఖిల్ తెలిపారు. పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు ఈ నెల 20, 21వ తేదీల్లో నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. గెలుపొందిన క్రీడాకారులను నెల్లూరు జిల్లా అధ్యక్షులు వి.మనీషా, ముఖేష్‌లు అభినందించారు.

19న కులగణన సర్వే

వలేటివారిపాలెం: మండలంలోని 15 సచివాలయాలు పరిధిలోని 21 పంచాయతీల్లో ఈ నెల 19 నుంచి కుల గణన సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కుల గణన చేస్తారని పేర్కొన్నారు. సర్వేకు ప్రజాప్రతినిధులు, ఆయా పంచాయతీల్లోని ప్రజలు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

20న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

ఉలవపాడు: అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 20 శనివారం కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీఓ విజయకుమారి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారంతా ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూ ప్రారంభం అవుతుందన్నారు.

సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ శిక్షణ తరగతుల్లో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే అధికారులకు శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ కె.లలిత, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీటీఏ డివిజన్ కార్యాలయం ప్రారంభం



బీటీఏ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ ఎంవీవీ.ప్రసాద్‌రావు

కందుకూరు రూరల్: బహుజన టీచర్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయాన్ని కందుకూర ఎంఈఓ ఎంవీవీ.ప్రసాద్‌రావు, కావలి ఎంఈఓ బండి గోవిందయ్య గురువారం ప్రారంభించారు. నెల్లూరు జిల్లా బీటీఏ అధ్యక్షుడు మణిసుబ్బు, ప్రధాన కార్యదర్శి మాస ప్రసాదు, రాష్ట్ర నాయకులు కల్లగుంట మోహన్‌రావు, సంగా మహేంద్ర, కట్టా రమేష్, శ్రీనివాసరావు, అక్కయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, కందుకూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండూరి రమణయ్య, నాగులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పీసీపల్లి: ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పూజల వెంకట నారాయణ కనిగిరి నుంచి మద్యాన్ని తెచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు మోదు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి, పట్టణంలోని అన్ని వార్డుల నుంచి భారీగా తరలి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో గురువారం పార్టీ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులతో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ విగ్రహం దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.400 కోట్లతో ఏర్పాటు చేశారన్నారు. ఈనెల 19న శుక్రవారం విజయవాడలో సీఎం చేతుల మీదుగా జరిగే విగ్రహావిష్కరణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పాలనలో దళిత వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ పాలనలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు గ్రాఫిక్స్‌లో చూపించి దళితులను మోసం చేశారని ఘాటుగా విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఇచ్చిన మాట ప్రకారం రెండేళ్లలో స్వరాజ్ మైదానంలో రూ.400 కోట్లతో 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. 19న ఉదయం 8 గంటల నుంచే నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బస్సులు బయలుదేరుతున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీకి సంబంధించిన బస్సులు వైఎస్సార్ భవన్ వద్ద నుంచి బయలు దేరుతాయని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని సుజాత, హుస్సేన్‌రెడ్డి, చప్పిడి సుబ్బయ్య, ఎస్కే జిలానీ, కౌన్సిలర్లు దేవరాజ్, వేల్పుల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, దాసరి మురళీ, సయ్యద్ రిజ్వానా ఖాలక్, ఇతర నేతలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఉలవపాడు: విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజాస్వామిక వాదులు తరలి రావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌లు కోరారు. విజయవాడ వెళ్లే వారి కోసం ఉలవపాడులో 1 బస్సు, కరేడులో 1 బస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



కందువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

వైఎస్సార్ సీపీలోకి 24 కుటుంబాలు చేరిక

పామూరు: మండలంలోని కోడిగుంపల కాలనీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎస్టీకాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు 24 కుటుంబాల వారు టీడీపీని వీడి కొడవటికంటి ఏసురత్నం, ఎందూటి దానియేలు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పార్టీలో చేరిన పలువురు నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులపై పార్టీలో చేరామన్నారు. బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి బద్దిపూడి మార్కు, పాలేటి ప్రేమ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్ర పోటీలు



గుడ్లూరులో బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న క్రీడాకారులు



కబడ్డీలో విజేతగా నిలిచిన మాచవరం జట్టుతో పీడీలు, కార్యదర్శులు



లింగసముద్రం: విజేతగా నిలిచిన క్రికెట్ జట్టు



కనిగిరిలో ఉత్సాహంగా సాగుతున్న క్రీడలు



క్రికెట్‌లో సత్తాచాటిన ఉమాఖాసిం, అయ్యప్ప



కొండపిలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న జట్లు

గుడ్లూరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు గుడ్లూరు, సాలిపేట సచివాలయాల పరిధిలో క్రీడా మైదానాల్లో హోరాహోరీగా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఈ నెల 10 నుంచి మండల స్థాయిలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు మండల స్థాయి పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ రాజశేఖరరావు తెలిపారు.

లింగసముద్రం: మండలస్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో లింగసముద్రం సచివాలయం-2 క్రికెట్ టీం విజేతగా నిలిచిందని ఎంపీడీఓ శేషుబాబు తెలిపారు. గురువారం స్థానిక కేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో లింగసముద్రం సచివాలయం-1, లింగసముద్రం సచివాలయం-2 జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించగా సచివాలయం-2 క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం నుంచి వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని చుండి మోడల్ స్కూల్ మైదానంలో రెండవ రోజు మండల స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయని ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ అన్నారు. మండలంలోని వలేటివారిపాలెం, అంకభూపాలపురం, నూకవరం, నేకూనాంపురం జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగినట్లు తెలిపారు. పోటీల్లో అంకభూపాలపురం జట్టుపై వలేటివారిపాలెం జట్టు గెలవగా , నేకూనాంపురం జట్టుపై నూకవరం జట్టు గెలిచి లీగ్ ఎంట్రీలోకి ఎంపికైనట్లు తెలిపారు. గెలిచిన రెండు టీమ్ సెమీఫైనల్‌లో తలపడతాయన్నారు. పోటీల్లో ఎంఈఓ మల్లికార్జున్ రావు, గ్రామ సర్పంచ్ ఇరుపనిసతీష్‌పీఈడీలు ఐజాక్, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, సునీత, పంచాయతీ కార్యదర్శులు అనిల్, రవికుమార్ పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ఆడుదాం -ఆంధ్ర పోటీలు గురువారం ఉత్సాహంగా సాగుతున్నాయి. ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి బి.కాశిరెడ్డి పర్యవేక్షణలో పీడీలు పోటీలు నిర్వహించారు. ఖోఖోలో తక్కెళ్లపాడు బాయ్స్, బాడ్మింటన్ గరల్స్‌లో పునుగోడు, వాలీబాల్‌లో పాతూరు సచివాలయం విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సంజీవి, పీడీలు హజరత్ రెడ్డి, పాశం సుశీల, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: కందుకూరు మండల, మున్సిపల్ స్థాయిలో ఆడుదాం... ఆంధ్ర ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానాల్లో జరిగిన పోటీలు క్రికెట్‌లో బృందావనం, వాలీబాల్‌లో కోటారెడ్డి నగర్-1, కబడ్డీలో మాచవరం, ఖోఖోలో మాచవరం, బ్యాడ్మింటన్‌లో కోటారెడ్డి నగర్-1 టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. విజేతలు ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే నియోజకవర్గ స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీఓ పి.విజయశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌లు అభినందించారు.

టంగుటూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా వల్లూరు గ్రామంలోని మైదానంలో గురువారం మర్లపాడు వీఎస్‌సీసీ టీం, మల్లవరప్పాడు సచివాలయం పరిధిలోని శివపురం టీం మధ్య క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. శివపురం టీంపై మర్లపాడు వీఎస్‌సీసీ టీం విజయం సాధించింది. మర్లపాడు వీఎస్ఎస్‌సీ టీంలో షేక్ ఉమాఖాసీం 4 వికెట్లు, 20 పరుగులు, అయ్యప్ప 3 వికెట్లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎంఈఓ-2 రామారావు గురువారం ప్రారంభించారు. కె.ఉప్పలపాడు, చిన్నలకండ్లగుంట జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, పాఠశాల పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత లింగారెడ్డిపల్లె



విన్నర్ జట్టుకు కప్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, నేతలు

పామూరు: యువత విద్యతోపాటు క్రీడల్లో కూడా సత్తా చాటాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య అన్నారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని వగ్గంపల్లెలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాయకులు గంటా రమణయ్య, ఎలికా అచ్చయ్యల నేతృత్వంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గురువారం సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కనిగిరి మండలం లింగారెడ్డిపల్లె జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన స్థానిక వగ్గంపల్లె జట్టుకు రూ.15 వేలు, తృతీయస్థానంలో నిలిచిన నల్లారెడ్డిపల్లె జట్టుకు రూ.10 వేల నగదు, కప్‌లను వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా రమణయ్య సమకూర్చగా వాటిని పార్టీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి నాయకులతో కలిసి విజేత జట్లకు అందజేశారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మితికాల బాలక్రిష్ణ, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, డేగా నాగేశ్వరరావు, షేక్.సుభాని, షేక్.షరీఫ్, ఎలీజర్ పలవురు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా అఖండజ్యోతి ఉత్సవాలు



అఖండజ్యోతి ఉత్సవాల్లో స్వామి సందేశం వివరిస్తున్న మాతాజీ

పామూరు: స్థానిక పాతపోస్టాఫీస్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబా అఖండజ్యోతి ఉత్సవాలు అర్చకుల వేదమంత్రాల నడుమ ఆలయ చైర్మన్ పబ్బతి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అఖండజ్యోతి కార్యక్రమాన్ని మాతాజీ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మిలు మాట్లాడుతూ భగవంతుడు ఒక్కడే అని ప్రతివ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలన్నారు. అఖండజ్యోతి ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఉదయం బాబా మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. దేవకి సుబ్రహ్మణ్యం, రెడ్డిసంక్షేమ సంఘ నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయళ్ల నారాయణరెడ్డి, సరాబు చంద్రమోహన్, మోరబోయిన గంగరాజుయాదవ్, పబ్బతి తిరుపతయ్య, టీవీకే సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై శివనాగరాజు

హనుమంతునిపాడు: సంక్రాంతిని పురస్కరించుకొని పెద్దగొల్లపల్లి యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి జరుగుతున్న నియోజకవర్గ స్థాయి మెగా క్రికెట్ టీం పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీలో నియోజకవర్గ స్థాయి నుంచి 24 జట్లు తలపడ్డాయి. పోటీల్లో పెద్దగొల్లపల్లి అంజి 11 టీమ్ ప్రథమ స్థానంలో నిల్వగా, రెండోవ స్థానంలో కనిగిరి జట్టు నిలిచింది. విజేతలకు దాత దేవిరెడ్డి శంకర్‌రెడ్డి ప్రథమ బహుమతి రూ.20,116 ఇవ్వగా రెండో బహుమతి వేంగపాటి వెలుగొండారెడ్డి రూ.10,116 ప్రదానం చేశారు. ఎస్సై కె.శివనాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని గెలుపొందిన టీమ్‌లకు బహుమతులు అందజేశారు.

వినుకొండలో దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ 4వ బ్రాంచిని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్‌ను అభినందించారు. వినుకొండ ప్రాంతంలో ఇలాంటి వైద్యశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ కృష్ణకాంత్ విలేకరులతో మాట్లాడుతూ మా హాస్పిటల్‌లో గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, సాధారణ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, అనుభవంతో కూడిన వైద్యబృందం సేవలు అందిస్తారని, ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగాలు, యాక్సిడెంట్, ట్రామా కేసులకు అనుభవజ్ఞులైన డాక్టర్లతో అత్యాధునిక వైద్యచికిత్సలు అతి తక్కువ ఖర్చుతో అందిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉచిత కన్సల్‌టేషన్, ఈసీజీ, 2డీ ఎకో, యాంజియోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినుకొండ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు మన్నే రవీంద్ర, డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, హాస్పటల్ వైద్య బృందం, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేలు జాతి లేగ దూడల ప్రదర్శన



లేగదూడలకు బహుమతులు అందిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

మద్దిపూడి(టంగుటూరు): మండలంలోని గుండ్లసముద్రం గ్రామ రైతు భరోసా కేంద్రంలో గురువారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీ రాణి హాజరయ్యారు. లేగ దూడలకు నట్టల నివారణ మందు తాగించి, దూడల యజమానులకు బహుమతులు అందించారు. డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ.. లేగ దూడలను సంరక్షించడం ద్వారా ఆర్థికంగా బలపడతారన్నారు. రైతులు దూడలకు సరిపడినంత పాలు అందజేస్తే మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. ఈఓ డాక్టర్ కాలేషా మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారణ ద్వారా లేగదూడల ఉత్పత్తిపై దృష్టి సారిస్తే రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారన్నారు. సెక్స్ సార్టెడ్ సెమన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎల్‌డీఏ చైర్మన్ రాధ మాట్లాడుతూ.. లేగ దూడల సంరక్షణ ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వేణు, పశువైద్యాధికారి కృపారావు, మద్దిపూడి పశువైద్యాధికారి శ్రావణి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, సిబ్బంది రాంబాబు, జాషువా, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుల గణన సర్వే

కొండపి(సింగరాయకొండ)/జరుగుమల్లి: గ్రామాల్లో శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభమవుతుందని కొండపి తహసీల్దార్ పి.సింగరావు, జరుగుమల్లి ఎంపీడీఓ జలజాక్ష్మి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తారని, ప్రజలు ఇంటి వద్ద అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటి స్థలం సర్వే కోసం ఆందోళన



హద్దు రాయి ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ శింగారావు

సింగరాయకొండ: ఇళ్ల మధ్య వివాదాస్పదంగా ఉన్న స్థలాన్ని కొలత వేయలేదంటూ కొండపి మండలం ముప్పవరం గ్రామానికి చెందిన దొడ్డక రాజు గురువారం వాటర్ ట్యాంకు ఎక్కి ఆందోళన చేశాడు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో తహశీల్దార్ సింగారావు స్పందించారు. గ్రామానికి వెళ్లి స్థలం సర్వే చేయించి హద్దు రాళ్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇళ్ల మధ్య స్థల వివాదాలు పరిష్కరించడం తమ విధి కాదని, స్థలం కొనుగోలు చేసేటప్పుడు హద్దులు చూసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

జరుగుమల్లి: మండల పరిధిలోని చిరికూరపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతోపాటు నేత్ర వైద్యులు పాల్గొంటారని, ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాబా ఆలయంలో సప్త మహాయజ్ఞం

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో సాయి సచ్చరిత్ర పారాయణ సప్త మహాయజ్ఞం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సచ్చరిత్ర పారాయణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముత్యాల ధర్మారావు, ఏసీ చెంచులు, వీసీ రామశాస్త్రీ, ఈర్లగురవయ్య, మండల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఉభయ దాతలు కాసు వెంకటేశ్వరరెడ్డి దంపతులు, మాధవరావు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మద్దిపూడి(టంగుటూరు): మిరప పంట సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన విస్తరణ అధికారి ధనలక్ష్మి సూచించారు. మండలంలోని జగ్గరాజుపాలెం, తంగెళ్ల గ్రామాల్లో మిరప తోటలను ధనలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిరప పంటలో నల్లి, కొమ్మ ఎండు తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతలు పంపిణీ

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో గురువారం అయోధ్య రామాలయం ఆధ్వర్యంలో శ్రీరాముని అక్షతల పంపిణీ కార్యక్రమం గురువారం వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ సభ్యురాలు యేల్చూరి భవాని శ్రీరాముని అక్షతలు, అయోధ్య రామాలయం చిత్రపటం, కరపత్రాలను రైల్వే స్టేషన్ రోడ్డు, పంచాయతీ కార్యాలయం రోడ్డు, కోదండరామస్వామి దేవస్థానం రోడ్డు, చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానం రోడ్డులో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. క్లబ్ సెక్రటరీ కొత్తమాసు ఉదయలక్ష్మి, ట్రెజరర్ శ్రీరాం సుశీల, శ్రీ చెట్టు మహాలక్ష్మి దేవస్థానం కమిటీ అధ్యక్షురాలు పోకూరి సుజాత లక్ష్మి పాల్గొన్నారు.